# ఆర్ఎస్ఎస్

# ప్రణాళిక

# 21వ శతాబ్దం కోసం


## సునీల్ అంబేకర్

తెలుగు అనువాదం : బీరం వెంకటేశ్వర రెడ్డి



ఎమెస్కో

# సంఘ్ దృష్టి కోణం

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, దాని ప్రస్థానం గురించి ఎన్నో పుస్తకాలు వెలువడినప్పటికీ, RSS ఎల్లప్పుడూ వార్తలలో ఉంటూనే ఉంది. స్వయంసేవకులు ప్రభుత్వంలో ఉన్నత స్థానాలలో ఉండటం కారణంగా, సంఘ ముఖ్య ఆలోచనలైన హిందూ రాష్ట్ర, ఏకాత్మత అనేవి నేటి రాజకీయ, సామాజిక జీవనంలో ప్రముఖంగా వినిపిస్తుండడంతో ఆర్ఎస్ఎస్ పని విధానం గురించి తెలుసుకోవాలన్న కుతూహలం పెరుగుతున్నది.

కాబట్టి, భారతదేశంలో సంఘ్ దృష్టి కోణం ఏమిటి? భారత్ హిందూ రాష్ట్ర అయితే అందులో ముస్లింల, ఇతర విశ్వాసాల వారి పరిస్థితి ఏమిటి? ఆర్ఎస్ఎస్ చేపట్టిన చరిత్రను తిరిగి లిఖించే ప్రాజెక్ట్ ఎంత పెద్దది? హిందుత్వ అనేది కుల రాజకీయాలను అధిగమిస్తుందా? మారుతున్న కుటుంబ విలువలు, స్వలింగ సంపర్కుల, హిజ్రాల హక్కుల విషయంలో సంఘ్ దృష్టి కోణం ఏమిటి? లాంటి ఎన్నో క్లిష్టమైన ప్రశ్నలను సంఘ ప్రచారక్ అయిన శ్రీ సునీల్ అంబేకర్ విశ్లేషించారు.

వాస్తవాలను నిశితంగా అర్థం చేసుకున్న వ్యక్తిగా, ఆలోచనలలో స్పష్టత కలిగి, వివరాలను సమగ్రంగా విశ్లేషించిన సునీల్ అంబేకర్‌జీ, గత కాలపు మైలురాళ్లను, వర్తమాన విజయాలను, భవిష్యదాలోచనలను కలగలిపి ఈ పుస్తకంలో పొందుపరిచారు. శాఖా పద్ధతిలో పనిచేసిన స్వయంసేవక్‌గా సంఘ్ ఆంతరంగిక కార్యపద్ధతి, నిర్ణయ ప్రక్రియ, పటిష్ఠమైన సమన్వయ ప్రక్రియ, కార్య విస్తరణ గురించి చాలా లోతుగా ఈ పుస్తకంలో వివరించారు.

వాస్తవిక జీవనంలోని అనుభవాలతో నిండిన 'ఆర్ఎస్ఎస్ ప్రణాళిక: 21వ శతాబ్దం కోసం' అనే ఈ పుస్తకం సంఘాన్ని, సంఘ కార్య పద్ధతిని, సంఘం భవిష్యత్ ఆలోచనలను అర్థం చేసుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదవవలసిన పుస్తకం ఇది.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | ఆర్ఎస్ఎస్ నిన్న-నేడు-రేపు | 9 |
| 1. | మూలాల అన్వేషణ | 21 |
| 2. | డాక్టర్జీ దార్శనికత : సంఘానికి ఆకృతినిచ్చిన ఆలోచనలు | 36 |
| 3. | శాఖ పద్ధతి, వ్యవస్థ : RSS పని విధానం | 47 |
| 4. | భారతదేశ చరిత్ర | 68 |
| 5. | సనాతన హిందుత్వం | 93 |
| 6. | కులం, సామాజిక న్యాయం | 118 |
| 7. | సంఘ్ పరివార్ | 139 |
| 8. | ప్రపంచీకరణ యుగంలో | 159 |
| 9. | కుటుంబం - నూతన సంబంధాలు | 175 |
| 10. | మహిళా ఉద్యమాలు | 191 |
| | ఉపసంహారం | 207 |
| | అనుబంధం | 213 |
| | సర్ సంఘ్‌చాలక్ ప్రస్తావన | 226 |
| | ఆహ్వానించాల్సిన పుస్తకం | 238 |
| | Foot Notes | 240 |

# ఆర్ఎస్ఎస్ నిన్న–నేడు–రేపు

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 60 ఏళ్ళు పూర్తయినపుడు, 2007లో నా మదిలో ఒక ప్రశ్న మెదిలింది. వలస పాలన నుండి విముక్తి పొందాక స్వాతంత్ర్యపు శతాబ్ది ఉత్సవాల సంవత్సరం 2047 నాటికి మన దేశపరిస్థితి ఎలా ఉంటుంది? సామాజిక సంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో దీర్ఘకాలిక స్వయంసేవక్‌గా, పూర్తికాలపు RSS ప్రచారక్ (లక్ష్యంతో స్ఫూర్తి పొందినటువంటి వ్యక్తి)గా, సభ్యత్వంలో, యూనివర్సిటీ శాఖల పరంగా ప్రపంచంలోనే అతి పెద్దదయినటువంటి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) తో పనిచేస్తున్న వాడిగా, నాలో ఉత్పన్నమైన ప్రశ్న ఏమిటంటే – ఆనాటికి RSS ఉనికికి ప్రయోజనం ఏమయినా ఉంటుందా?

ప్రపంచానికంతటికి జ్ఞానాన్ని ప్రసాదిస్తూ, మార్గదర్శనం చేస్తూ భారతదేశం విశ్వగురువుగా అవతరిస్తుందని, "సంఘం" సమాజాన్నుండి విడదీయరానిదిగా మారుతుందని సంఘ పెద్దలతో నేను చర్చించినపుడు నాకు లభించిన సమాధానం. సంఘం – భారత సమాజంలో పాలలో పంచదారలా కలిసిపోయి ఉంటుందని, అలాగే పంచదార కలిసిన తర్వాత పాలు ఎలాగైతే పంచదార మాధుర్య లక్షణాలనే ప్రదర్శిస్తాయో, భారత సమాజం కూడా సంఘం యొక్క లక్షణాలనే ప్రదర్శించడం మొదలు పెడుతుంది. కాబట్టి, సంఘం సమాజానికి సహవ్యాపకంగా మారుతుంది. అంతటితో సంఘం ఒక ప్రత్యేక సంస్థగా ఉండాల్సిన అవసరం తీరిపోతుంది.

**సంఘ్ సమాజ్ బనేగా**

సంఘం ఎన్నడూ కూడా సమాజాన్ని శాసించే ఒక ప్రత్యేకశక్తిగా ఉండాలనుకోలేదు. సమాజాన్ని బలోపేతం చేయాలనుకుంటున్నది. తద్వారా సమాజం తన సమస్యలను తానే పరిష్కరించుకోగలుగుతుంది. తమకంటూ ప్రత్యేక స్థానాన్ని వదిలేస్తూ ఎలాగైతే నదులన్నీ సముద్రంలో కలిసిపోతాయో, అలాగే సంఘం – సమాజంలో మిళితమైపోవటమే పరమోత్కృష్టమైన లక్ష్యం. ఈ స్ఫూర్తిని గుర్తుచేస్తూండటం కోసమే సంఘంలో "సంఘ్ సమాజ్ బనేగా" (సంఘమే సమాజమవుతుంది) అని పదే పదే నినదిస్తూ ఉంటారు.

భారతదేశం విశ్వగురువుగా అవతరించడమనేది అర్థం చేసుకోవాల్సిన ఇంకొక ప్రశ్న. అందుకనే, '21వ శతాబ్దంలో RSS' అనే అంశంపై పుస్తకం రాయాలనే సూచన నాకు వచ్చినప్పుడు, ఆ అవకాశాన్ని ఎంతో ఉత్సాహంతో సద్వినియోగ పరచుకున్నాను.

నిరంతరం మారుతుండే ప్రస్తుత సమాజానికి ప్రాచీన నాగరికపు ఆలోచనలను సందర్భోచితంగా అన్వయించేలా చేసే ప్రక్రియ గురించి వివరించడమే ఈ పుస్తకం ఉద్దేశం. "గతం నుండి, వర్తమానం ద్వారా, భవిష్యత్తులోకి" అని సంఘ ప్రముఖ సిద్ధాంత కర్తలలో ఒకరయిన పండిట్ దీనదయాళ్ జీ చెప్పినట్లు 94 ఏళ్ళ సంఘ ప్రయాణం భవిష్యత్తులో ఎలా ఉండబోతున్నదనేది ఈ పుస్తకంలో వివరించబడింది. ఇది ఒక సాధకుడి రచన, సంఘం లోపలిమనిషి చూస్తున్న దృశ్యం. బాల్యం నుండి ఆర్.యస్.యస్.తో నాకు అనుబంధం ఉంది. అది చాలా సహజంగా జరిగింది. నాగపూర్‌లో మా ఇల్లు ఆర్.యస్.యస్. ప్రధాన కార్యాలయం 'హెడ్గేవార్ భవన్' ప్రక్కనే ఉండేది. మా ఇంటి తలుపులు తెరవగానే ఆర్.యస్.యస్. మైదానం ఉండేది. సంఘమనేది నా నిత్య జీవితంలో ఒక భాగంగా ఉండేది.

ఆర్.యస్.యస్.లో స్వయంసేవకులకు తొలి అడుగులు నేర్పే 'శాఖ'కు నేను రోజూ వెళ్ళేవాడిని. నిర్ణీత కార్యక్రమాల ప్రకారం ప్రతిరోజుగాని, వారానికొకసారిగాని స్వయంసేవకులందరూ కలుసుకునే 'శాఖ' లోనే మా అందరికి శిక్షణ ఇవ్వబడేది. వాటికనుగుణంగా మేమంతా శారీరక అభ్యాసాలు చేసేవాళ్ళం. సెలవుల్లో, మా తోటి విద్యార్థులందరికి సంఘ ప్రాంగణాలే క్రీడా మైదానాలుగా ఉండేవి.

హెడ్గేవార్ భవన్ ప్రాంగణంలో జరిగే శాఖ పేరు "మోహితే శాఖ". ప్రతి శాఖకు ఒక పేరుంటుంది, ఆ పేరు సహజంగా శాఖ జరిగే స్థలం పేరుతోగాని లేదా ఒక ప్రముఖుడి పేరుతోగాని ఉంటుంది. "మోహితే" అనేది ఆ స్థలం పేరు. ఆ స్థలం అసలు యజమాని ఇంటిపేరు కూడా. శాఖ జరిగే సమయాన్ని బట్టి 'సాయంశాఖ', ప్రాత: శాఖ, నిశాశాఖ అని పిలుస్తారు.

దేశవ్యాప్తంగా విస్తృత సంఖ్యలో గల శాఖల నెట్‌వర్కే RSS.శాఖలు. సమావేశాలు ఉదయం గాని, సాయంత్రం గాని జరుగుతాయి. పగలు ఉద్యోగాలు చేసేవారికోసం రాత్రి శాఖలు కూడా ఉంటాయి.

నేను 'మోహితే సాయంశాఖ'లో స్వయంసేవకుడినయ్యాను, శాఖ యొక్క నిర్వహణా సమయం నా గడియారంగా మారిపోయింది. శాఖకు హాజరయిన తరువాత ఇంటికెళ్ళి